## మై రెడీమర్ స్కూల్ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు




**తెలుగు గళం న్యూస్ జనగామ/కొడకండ్ల సెప్టెంబర్ 12**

జనగామ జిల్లాలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు వేడుకల్లో కొడకండ్ల మై రెడీమర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై అవార్డులు అందుకున్నారు.జనగామ--సూర్యాపేట రోడ్డులోని భ్రమరాంబ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 60 పాఠశాలల నుంచి ఎంపికైన 120 మంది ఉత్తమ ఉపాధ్యాయులను అవార్డులు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించారు. మై రెడీమర్ స్కూల్ స్కూల్ ఇన్‌చార్జ్ సునప్ జమీర్, ఉపాధ్యాయురాలు పెదపూడి ప్రశాంతి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై అవార్డులు అందుకున్నారు.కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు సదుల మధుసూదన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. రమేష్ రావు, రాష్ట్ర కోశాధికారి పి. రాఘవేందర్ రెడ్డి, రాష్ట్ర సలహాదారు ఈ. ప్రభాకర్ రెడ్డి తదితరులు హాజరై అవార్డు గ్రహీతలను అభినందించారు. జిల్లా అధ్యక్షులు పి. వెంకట్ రెడ్డి, కార్యదర్శి రాపాక విజయ్, కోశాధికారి పి. ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా మై రెడీమర్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ పెదపూడి ప్రసన్న కుమార్‌ను కూడా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడంతో పాటు, ప్రిన్సిపాల్‌కు సన్మానం జరగడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, ప్రతిభా వికాసానికి ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలకు ఈ అవార్డులు గుర్తింపుగా నిలిచాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

## దిశా సమావేశం ఎజెండాలో జనగాం అభివృద్ధి అంశాలు చేర్చాలి

### విద్య, ఉపాధి, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలి: నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి

**తెలుగు గళం న్యూస్ జనగామ సెప్టెంబర్ 12**



జనగాం జిల్లా సమగ్ర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలను ఈ నెల 15న నిర్వహించనున్న దిశా కమిటీ సమావేశం ఎజెండాలో చేర్చి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి కోరారు. ఈ మేరకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు, జనగాం జిల్లా దిశా కమిటీ చైర్‌పర్సన్ కడియం కావ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.జిల్లాలో విద్య, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కడియం కావ్య సానుకూలంగా స్పందించి, ఈ నెల 15న జరిగే దిశా సమావేశంలో విద్య, ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలను ఎజెండాలో చేర్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లాలో విద్యాసంస్థల ఏర్పాటుతో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు లభించడంతో పాటు, పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని బిర్రు ఇస్తారి పేర్కొన్నారు. ముఖ్యంగా కళ్లెం గ్రామంలోని టెక్స్టైల్ పార్కులో చేనేతకు సంబంధించిన పరిశ్రమలను ఏర్పాటు చేసి, చేనేత కార్మికులకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ అంశాలన్నింటిపై దిశా కమిటీ సమావేశంలో సమగ్రంగా చర్చించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి జనగాం జిల్లా అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని నాగరత్న సేవా సంఘం తరఫున విజ్ఞప్తి చేశారు.

**ప్రధానంగా చర్చించాల్సిన అంశాలు**

1. జనగాంలో ఏటీసీ (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) మంజూరైన నేపథ్యంలో త్వరితగతిన శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాలి.
2. జనగాంలో కాకతీయ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి.
3. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ ఏర్పాటు చేయాలి.
4. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి.
5. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలి.
6. జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలి.
7. విద్యార్థులు, యువతకు ఉపయోగపడేలా అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు చేయాలి.
8. లింగాల ఘణపురం మండలం కళ్లెం గ్రామంలోని టెక్స్టైల్ పార్క్‌ను అభివృద్ధి చేసి చేనేతకు సంబంధించిన పరిశ్రమలను తీసుకురావాలి.
9. జనగాం ఏరియా ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్ సదుపాయం కల్పించడంతో పాటు వైద్య సేవలను విస్తరించాలి.

## ఏటి ఆంజనేయులుకు 'భారతరత్న' పురస్కారం



**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్ సెప్టెంబర్ 12**




సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జాతీయ ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులుకు అరుదైన గౌరవం లభించింది.దేశవ్యాప్తంగా సమాచార హక్కు చట్టం పరిరక్షణ, ప్రజలకు చట్టంపై అవగాహన కల్పించడం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు గుర్తింపుగా శ్రీ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు 'భారతరత్న' పురస్కారాన్ని అందజేశారు.రవీంద్రభారతిలో నిర్వహించిన రక్షాబంధన్ సెలబ్రేషన్స్‌లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి బాబు మోహన్ చేతుల మీదుగా ఏటి ఆంజనేయులు పురస్కారాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ఏటి ఆంజనేయులు మాట్లాడుతూ..సమాచార హక్కు చట్టం ద్వారా ఎంతోమంది నిరుపేదలు తమ సమస్యలను పరిష్కరించుకోగలిగారని తెలిపారు. దేశంలో ఏ స్థాయిలో అవినీతి జరిగినా దానిని ప్రశ్నించేందుకు సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఉన్న శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు.సమాచార హక్కు చట్టం-2005ను ప్రతి పౌరుడు సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు.ప్రజలకు పారదర్శక పాలన, సమాన న్యాయం అందించడంతో పాటు అవినీతిని అరికట్టడమే సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు.తమ సంస్థ ద్వారా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు అధికారులపై చర్యలు తీసుకునేలా కృషి చేసిన సందర్భాలు ఉన్నాయని పేర్కొన్నారు.ప్రతి పౌరుడు దేశంలోని చట్టాలపై అవగాహన పెంచుకుని తన హక్కులు, బాధ్యతలను తెలుసుకుంటే నేరాలు తగ్గి దేశం మరింత ప్రగతి సాధించేందుకు దోహదపడుతుందని అన్నారు. తన సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేసిన శ్రీ వల్లూరి ఫౌండేషన్‌కు ఈ సందర్భంగా ఏటి ఆంజనేయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ కరెంట్ కోతలపై రైతుల కన్నెర్ర

### కందుకూరులో సబ్‌స్టేషన్ ముట్టడి.. రైతులకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

**సత్తుపల్లి/వేంసూరు,సెప్టెంబర్12(తెలుగు గళం) న్యూస్:** ఖమ్మంజిల్లా, సత్తుపల్లి నియోజకవర్గం, వేంసూరు మండలం కందుకూరులో విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా రైతులు ఆందోళనకు దిగారు. కందుకూరు, దిద్దుపూడి, భరణిపాడు, లచ్చన్నగూడెం గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన ర్యాలీ నిర్వహించి సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఏడు గంటల విద్యుత్‌ను కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడితే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సి వస్తుందని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను కేసీఆర్ సవాల్‌గా తీసుకుని, తెలంగాణ రాష్ట్రంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించారని అన్నారు. వ్యవసాయాన్ని దండగ నుంచి పండగగా మార్చి రైతులకు భరోసా కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు.

**మళ్లీ కరెంట్ కోతలు ఎందుకు?**

రాష్ట్రంలో మళ్లీ విద్యుత్ కోతలు ఎందుకు విధిస్తున్నారని సండ్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతుల విద్యుత్ అవసరాలపై ముందస్తు ప్రణాళిక లేకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేసైనా రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు.

**ఎరువుల కోసం రైతులను ఇబ్బంది పెట్టొద్దు**

ఎరువుల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని సండ్ర ఆరోపించారు. యాప్ ద్వారా ఎరువుల పంపిణీ పేరుతో రైతులకు ఇబ్బందులు సృష్టించడం సరికాదన్నారు. చాలామంది రైతుల వద్ద స్మార్ట్‌ఫోన్లు లేవని, గతంలో మాదిరిగానే కూపన్ల విధానంలో ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు.

అలాగే ఎరువుల కొరతను ముందుగానే గుర్తించి సరిపడా నిల్వలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.




**రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి**

వరంగల్ రైతు డిక్లరేషన్‌లో అన్ని రకాల పంటలకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కొన్ని పంటలకే పరిమితం చేయడం రైతులను మోసం చేయడమేనని సండ్ర విమర్శించారు. రైతు కూలీలకు అండగా ఉంటామని, రైతు భరోసా పెంచుతామని ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రైతులను ఇబ్బందుల్లోకి నెట్టకుండా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

**సీతారామ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రచారం సరికాదు**

కేసీఆర్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి భారీగా నిధులు వెచ్చించి పనులను ముందుకు తీసుకెళ్తే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం స్వల్ప నిధులతో చేపట్టిన పనులకు మొత్తం ప్రాజెక్టు ఘనతను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని సండ్ర విమర్శించారు.

రైతులకు కోతలు లేని విద్యుత్ అందించి పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.

సండ్ర వెంకట వీరయ్య సబ్‌స్టేషన్‌లోకి వెళ్లి విద్యుత్ సరఫరాకు సంబంధించిన లాగ్‌బుక్‌ను పరిశీలించారు. లాగ్‌బుక్‌ను చూపించేందుకు అధికారులు తొలుత కొంత నిరాకరించడంతో.. విద్యుత్ సరఫరా పరిస్థితిపై మరిన్ని అనుమానాలు వ్యక్తమయ్యాయి. అనంతరం లాగ్‌బుక్‌ను పరిశీలించిన సండ్ర.. రైతులకు వాస్తవంగా ఎంతసేపు విద్యుత్ సరఫరా అవుతుందో, ఎంతసేపు అంతరాయం ఏర్పడుతుందో వివరాలను పరిశీలించారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా తప్పించుకునే ధోరణి విడనాడి.. తక్షణమే కోతలు లేని విద్యుత్ అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కందుకూరులో రైతులతో ప్రారంభమైన ఈ ఆందోళన ఆరంభం మాత్రమేనని, విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని సండ్ర వెంకట వీరయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ధర్మసాగర్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

### రైతాంగ సాయుధ పోరాట చరిత్రను నేటి తరానికి తెలియజేయాలి




**ధర్మసాగర్, సెప్టెంబర్ 12 (తెలుగు గళం):** ధర్మసాగర్ మండల కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర, పోరాట యోధుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన చారిత్రక పోరాటమని పేర్కొన్నారు. నాటి పోరాట యోధుల త్యాగాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతాంగ హక్కుల కోసం జరిగిన పోరాట చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునగాల భిక్షపతి, మండల కార్యదర్శి కొట్టే వెంకటేష్, సీనియర్ నాయకులు గోకల రాజయ్య, సునీల్, సాయిపేట రాజన్న, సారయ్య, రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

### :జిల్లా ప్రధాన న్యాయమూర్తి జే.జీవన్ కుమార్





**తెలుగుగళం న్యూస్ భూపాలపల్లి**

ప్రజలకు ఉచితంగా,సత్వర న్యాయం అందించే లక్ష్యంతోనే న్యాయసేవాధికార సంస్థలు ఏర్పాటయ్యాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి,జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జే.జీవన్ కుమార్ పేర్కొన్నారు.శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడారు.కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతూ సమయం,డబ్బు వృథా చేసుకోకుండా రాజీమార్గంలో వివాదాలను పరిష్కరించుకోవాలని సూచించారు.క్రిమినల్,మోటార్ ప్రమాద,కుటుంబ వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకుంటే సమాజంలో సోదరభావం,శాంతిభద్రతలు పరిరక్షించబడతాయని తెలిపారు.ఎలాంటి ఒత్తిళ్లకు తావులేకుండా స్వచ్ఛందంగా మాత్రమే రాజీకి ముందుకు రావాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి టి.మహతి వైష్ణవి,న్యాయమూర్తులు ఎస్.ఆర్.దిలీప్ కుమార్ నాయక్,జి.అఖిల,ఆర్డీవో పోరిక హరికృష్ణ,డీఎస్పీ సంపత్ రావు,బార్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు కే.సురేష్ కుమార్,ఏ.రాములు,జీపీ బోట్ల సుధాకర్,న్యాయవాదులు,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

**లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కీలక వివాదాలు**

ముగిసిన భూ వివాదం

భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరి మధ్య మూడేళ్లుగా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నడుస్తున్న భూ వివాదం (సీసీ 1168/2024) లోక్ అదాలత్ ద్వారా సామరస్యంగా పరిష్కారమైంది.ఇరువర్గాలు రాజీకి రావడంతో కేసును కొట్టివేశారు.

**ఒక్కటైన దంపతులు**

కాటారం పరిధిలో విభేదాల కారణంగా మూడేళ్లుగా కోర్టు చుట్టూ తిరుగుతున్న ఓ జంట (సీసీ 1598/2024) అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోని లోక్ అదాలత్ ద్వారా మనస్పర్థలు వీడి రాజీ కుదుర్చుకుంది.తిరిగి కలిసి జీవించేందుకు పరస్పర అంగీకారంతో కేసును విరమించుకున్నారు.


## బ్రిక్స్‌లో కీలక పరిణామం.. యుద్ధం వేళ, ఇరాన్-యూఏఈ చర్చలు..




**తెలుగు గళం:** న్యూఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సమావేశాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖాలెద్ బిన్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భేటీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఇద్దరు దేశాధినేతల మధ్య చర్చల్ని కీలక పరిణామంగా చెబుతున్నారు. శనివారం ఇద్దరు నేతలు చర్చలు జరిపారు. ఈ విషయాన్ని ఇరాన్ రాయబార కార్యాలయం వెల్లడించింది. అమెరికా, ఇజ్రాయిల్‌లు కలిసి ఇరాన్‌పై దాడి చేసిన తర్వాత, గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరాన్ యూఏఈలోని దుబాయ్, అబుదాబితో పాటు పలు కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసింది.

ఇరాన్, యూఏఈ మధ్య సంబంధాల్లో ఉద్రిక్తత నెలకొన్న తరుణంలో ఈ చర్చలు పరిష్కారానికి మార్గాన్ని సుగమం చేస్తాయని భావిస్తున్నారు. గతంలో ఇరాన్ తమపై చేస్తున్న దాడుల్ని యూఏఈ తీవ్రంగా ఖండించింది. తమ సార్వభౌమాత్వాన్ని ఉల్లంఘించే చర్యల్ని సహించేది లేదని, అవసరమై ప్రతిస్పందిస్తామని హెచ్చరించింది. మరోవైపు, అమెరికాకు ఆశ్రయం ఇచ్చే దేశాలను లక్ష్యంగా చేసుకుంటామని ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే యూఏఈ, కువైట్, బహ్రైయిన్, ఖతార్, సౌదీ దేశాల్లోని అమెరికా స్థావరాలపై, ఇంధన మౌలిక సదుపాయాలపై ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులు చేసింది.

## ఫోన్ రిపేర్ కోసం వచ్చి.. అమీర్‌పేట్‌లో యువతి మృతి



**పంజాగుట్ట,తెలుగు గళం:** సెల్‌ఫోన్ రిపేర్ కోసం వచ్చిన ఓ యువతి రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఈ ఘటన హైదరాబాద్ అమీర్‌పేట శ్రీనగర్ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన వి.హేమదుర్గ (26) ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ బంజారాహిల్స్‌లోని ఓ కార్ల కంపెనీలో పనిచేస్తోంది. తన సెల్‌ఫోన్ రిపేర్ కోసం ఆఫీస్‌లో పర్మిషన్ తీసుకుని అమీర్‌పేటకు ర్యాపిడో బైక్‌పై బయలుదేరింది. అమీర్‌పేట బిగ్‌బజార్ వెనుక గేట్ సమీపంలోకి రాగానే ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో హేమదుర్గ అక్కడికక్కడే మృతిచెందింది. బస్సు డ్రైవర్ షేక్ అన్వర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పంజాగుట్ట పోలీసులు తెలిపారు.

# బస్టాప్‌లో కుర్చీలు మాయం.. రాత్రివేళ ప్రయాణికులకు రక్షణ ఏది? -- ప్రజల ఆందోళన

**జగన్నాథపురం వై జంక్షన్‌లో లైట్లు లేక చీకట్లో ప్రయాణికుల అవస్థలు**

**మహిళల భద్రతపై అధికారుల నిర్లక్ష్యం తగదు -- వెంటనే లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి**








తెలుగు గళం వాజేడు, సెప్టెంబర్ 12:

ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాథపురం పబ్లిక్ బస్టాప్, నేషనల్ హైవే-163 వై జంక్షన్ వద్ద ప్రయాణికుల భద్రతపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన జంక్షన్ అయినప్పటికీ రాత్రి వేళల్లో కనీసం వీధి దీపాలు కూడా లేకపోవడంతో ఆ ప్రాంతం పూర్తిగా చీకటిమయంగా మారుతోంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు బస్సుల కోసం వేచి ఉండాలన్నా, బస్సు దిగి అక్కడి నుంచి వెళ్లాలన్నా భయాందోళనకు గురవుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. నేషనల్ హైవేకు అనుసంధానమైన ప్రధాన జంక్షన్ వద్ద సరైన లైటింగ్, భద్రతా ఏర్పాట్లు లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. అలాగే ప్రయాణికులు కూర్చోవడానికి ఏర్పాటు చేసిన బస్టాప్‌లోని కుర్చీలు ప్రస్తుతం కనిపించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దొంగలు ఎత్తుకెళ్లిన కుర్చీల స్థానంలో వెంటనే కొత్త కుర్చీలు ఏర్పాటు చేసి బస్టాప్‌ను ప్రయాణికులకు అనుకూలంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు. కాబట్టి సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి జగన్నాథపురం వై జంక్షన్ వద్ద విద్యుత్ దీపాలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు బస్టాప్‌లో కుర్చీలు పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# సీతారాం ఏచూరి జీవితం ఆదర్శప్రాయం"





సత్తుపల్లి,ఆర్ సి,సెప్టెంబర్12(తెలుగు గళం) న్యూస్: సీపీఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అమరజీవి కామ్రేడ్ సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సభ నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆమెతో పాటు శీలం సత్యనారాయణరెడ్డి, మోరంపూడి పాండురంగారావు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ప్రజా, శ్రామిక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించిన ఏచూరి జీవితం అందరికీ ఆదర్శమన్నారు. అణగారిన వర్గాల సమస్యలపై పార్లమెంటులో గళమెత్తిన గొప్ప మార్క్సిస్టు మేధావి అని కొనియాడారు. ఏచూరి స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం, రైతు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట మాజీ శాసనసభ్యుడు అరూరి రమేష్ పరామర్శ

తెలుగు గళం న్యూస్
పర్వతగిరి/సెప్టెంబర్ 12



వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో ఉదయం నుండి కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బాధిత కుటుంబాలను వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు అరూరి రమేష్ పరామర్శించారు. పర్వతగిరి మండలం సోమారం గ్రామానికి చెందిన రాపాక సమ్మక్క, బూర్గుమళ్ల గ్రామానికి చెందిన బొబ్బాల లక్ష్మి చంద్రరెడ్డి,పర్వతగిరి గ్రామానికి చెందిన మడ్డి కుమారస్వామి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకుని వారి ఇళ్లకు వెళ్లి మృతులకు నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ పరామర్శలో ఆయనతో పాటు సహకార సంఘం అధ్యక్షుడు మనోజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు ఏడుదొడ్ల జితేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రంగు కుమార్, మండల మాజీ రైతుబంధు అధ్యక్షుడు చిన్నపాక శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ లు ఏర్పుల శ్రీనివాస్, ఎలికట్టె కృష్ణవేణి వేణు, మాజీ ఎంపిటిసి మాడుగుల రాజు, మండల నాయకులు చింతల శ్రీనివాస్, బూర శ్యామ్, జంగిలి యాకయ్య, రంగు కుమార్ గౌడ్, బొట్ల భాస్కర్, చిన్నపెల్లి అజయ్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల భద్రతపై రాజకీయం చేస్తే ఊరుకోం

**-- ఆర్టిఏ మెంబర్ వసంత శ్రీనివాస్ యాదవ్ ఫైర్**

**గర్ల్స్ హాస్టల్‌పై బీఆర్ఎస్, బీజేపీ దుష్ప్రచారం బంద్ చేయాలి**

**మంత్రి సీతక్కపై అసత్య ఆరోపణలు చేస్తే ఖబడ్దార్**

**విద్యార్థినుల భద్రత, వసతుల కోసమే ఏటూరునాగారానికి హాస్టల్ తరలింపు**



తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబరు 12:

గిరిజన సంక్షేమ బాలికల హాస్టల్‌పై బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను తక్షణమే నిలిపివేయాలని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. విద్యార్థినుల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకునే వాజేడు ప్రాంతంలోని హాస్టల్ నుంచి సుమారు 250 మంది బాలికలను ఏటూరునాగారానికి తరలించామని స్పష్టం చేశారు. విద్యార్థినుల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని, అనుమతులు లేకుండా హాస్టల్‌లోకి ప్రవేశించి విద్యార్థినులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. మంత్రి సీతక్కపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, ప్రతిపక్షాలు చిల్లర రాజకీయాలు మాని సమస్యల పరిష్కారానికి సహకరించాలని వసంత శ్రీనివాస్ సూచించారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్య, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నరసింహారావు, టౌన్ అధ్యక్షుడు కె.రంజిత్, వర్కింగ్ ప్రెసిడెంట్ సరికొప్పుల శ్రీనివాస్, నాయకులు ఇర్సవడ్ల కిరణ్, నాగవత్ కిరణ్, రిజ్వాన్, జిమిడ కళ్యాణ్, షేక్ సద్దాం, అఫ్రిది తదితరులు పాల్గొన్నారు.

# వరుణుడి కరుణ-రైతన్నలకు ఊరట



తెలుగు గళం న్యూస్
ఐనవోలు/సెప్టెంబర్12

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం నుండి కురుస్తున్న వర్షాలతో రైతన్నలకు ఎంతో మేలు జరిగింది.గత కొన్ని రోజులుగా వర్షాలు ముఖం చాటేయడంతో పంటలు ఎండిపోతాయేమోనని రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.వరి,పత్తి, మొక్కజొన్న పంటలు నీరు లేక వాడిపోతున్న తరుణంలో ఈ వర్షం వారికి వరంగా మారింది.ఈ వానతో పొలాలకు జీవం వచ్చిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాట్లు వేసిన వరి పొలాలకు, ఏపుగా ఎదుగుతున్న పత్తి చేనుకు ఈ వర్షం ఎంతో అవసరమని అంటున్నారు.ఇలాగే మరో రెండు రోజులు వర్షాలు కురిస్తే చెరువులు, కుంటలు నిండి భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు పెరిగితే రాబోయే యాసంగి పంటకు కూడా ఎంతో మేలు జరుగుతుందని రైతన్నలు చెబుతున్నారు.

# అనారోగ్య బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండ

**రూ.3.82 లక్షల చెక్కులు పంపిణీ చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు విక్రాంత్ బాబు**

**వైద్య ఖర్చులతో ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలకు ఊరట**

**నాగారం, చంద్రుపట్ల బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత**



తెలుగు గళం వాజేడు, సెప్టెంబర్ 12:

ములుగు జిల్లా వాజేడు మండలం నాగారం, చందుపట్ల గ్రామాలకు చెందిన అనారోగ్య బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకర్లపూడి విక్రాంత్ బాబు చేతుల మీదుగా అందజేశారు. నాగారం గ్రామానికి చెందిన యాలం హనుమంతరావుకు రూ.1,50,500, చంద్రుపట్ల గ్రామానికి చెందిన వనపర్తి సృజనకు రూ.1,47,000, మరో బాధిత కుటుంబానికి రూ.85,000 చొప్పున మొత్తం రూ.3,82,500 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విక్రాంత్ బాబు మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. బాధితులకు సీఎంఆర్ఎఫ్ మంజూరుకు కృషి చేసిన మంత్రి సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులకు కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తల్లడి ఆదినారాయణ, నల్లగాసి రమేష్, అనుముల సంజీవ, బోదెబోయిన రామన్న, యాలం సీతాలు, తల్లడి నానిబాబు, చింతకుంట్ల మదనయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏచూరి ఆశయాల సాధనకు ప్రజా ఉద్యమాలను బలోపేతం చేస్తాం

**సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, మండల కార్యదర్శి మునిగెల రమేష్**



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘన్‌పూర్ సెప్టెంబర్ 12

భారత రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్రి అహల్య, మండల కార్యదర్శి మునిగెల రమేష్ అన్నారు.సీతారాం ఏచూరి రెండో వర్ధంతి సందర్భంగా సీపీఎం స్టేషన్ ఘన్‌పూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు, రైతులు, పేదలు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏచూరి నిరంతరం పోరాడారని గుర్తుచేశారు.ప్రజా ఉద్యమాల నిర్మాణంలో, వామపక్ష శక్తుల ఐక్యతలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు.రాజ్యసభ సభ్యునిగా పార్లమెంటులో ప్రజల గొంతుకగా నిలిచిన ఏచూరి.. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను సమర్థవంతంగా ప్రశ్నించారని అన్నారు.ఆయన ప్రసంగాలు విషయ పరిజ్ఞానం, ప్రజా సమస్యల పట్ల నిబద్ధతకు ప్రతీకగా నిలిచాయని పేర్కొన్నారు.దేశంలో మతోన్మాదం, సామాజిక విభజనకు ప్రయత్నాలు జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సీతారాం ఏచూరి ప్రబోధించిన లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం మరింత అవసరమని అన్నారు. ప్రజల ఐక్యతను కాపాడుతూ కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయడమే ఏచూరికి నిజమైన నివాళి అని పేర్కొన్నారు.ఏచూరి చూపిన మార్గంలో పార్టీ శ్రేణులు ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడాలని, ఆయన ఆశయ సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు కుర్ర ఉప్పలయ్య, కత్తుల రాజు, గట్ల మల్లారెడ్డి, తోడెంగల ఐలయ్య, చిలుముల్ల భాస్కర్, పోలాసు పరమేష్‌తో పాటు నాయకులు పోలాసు కిష్టయ్య, రామగోని సతీష్, సట్ల రాజు, దైద కుమార్, లింగనబోయిన కుమార్, మంద మొగిలి, పోలాసు పద్మాకర్, లింగనబోయిన సుధాకర్, పోలాసు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# అన్నను కడసారి చూసేందుకు వచ్చి.. అంత్యక్రియల్లో చెల్లెలు మృతి





భువనగిరి ,తెలుగు గళం: తోడబుట్టిన అన్న మృతి చెందగా.. కడసారి చూసేందుకు వచ్చిన చెల్లెలు.. చివరికి అన్నతోనే తన జీవన ప్రయాణాన్ని ముగించింది. సోదరుడి అంత్యక్రియలు పూర్తికాకముందే ఆమె గుండె ఆగిపోయింది. యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరిలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటన స్థానికులను కలిచివేసింది. రాయగిరికి చెందిన కొత్త మల్లయ్య యాదవ్ (70) శుక్రవారం మృతి చెందారు. అన్న మరణవార్త తెలుసుకున్న యాదగిరిగుట్ట మండలం దాతారుపల్లికి చెందిన చుక్కల వెంకమ్మ (62) శనివారం రాయగిరికి చేరుకున్నారు. అన్న భౌతికకాయాన్ని చూసి తీవ్రంగా రోదించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ కన్నీరుమున్నీరయ్యారు. అన్నను కోల్పోయిన బాధను తట్టుకోలేక ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు విడిచారు. మల్లయ్య యాదవ్‌కు అంతిమ వీడ్కోలు పలుకుతున్న కుటుంబ సభ్యులకు.. కళ్లముందే వెంకమ్మ విగతజీవిగా కనిపించడంతో ఆ దుఃఖం రెట్టింపైంది. ఈ ఘటనతో రాయగిరి, దాతారుపల్లి గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.